పదిలో పదిలంగా.. భవిష్యత్తుకు బాసటగా..

- పదో తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు
- విద్యార్థులకు ప్రాక్టీస్ కోసం రోజూ రాత పరీక్షలు
- ఒత్తిడికి లోనవకుండా ఉపాధ్యాయుల మార్గనిర్దేశం

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	పదో తరగతి విద్యార్థులు
అల్లవరం	11	771
ఉప్పలగుప్తం	08	600
ముమ్మిడివరం	10	553
అమలాపురం	14	1339
తాళ్లరేవు	12	1042
ఐ.పోలవరం	11	611
కాట్రేనికోన	08	524

ఉప్పలగుప్తం: పదో తరగతి పరీక్షలన్నవి ప్రతి విద్యార్థి జీవితంలోను ఎంతో కీలకం. అనేక ఉన్నత విద్య కోర్సులకు పదో తరగతి పరీక్షల్లో సాధించే మార్కుల్ని సైతం పరిగణలోకి తీసుకుంటారు. అందుకే భవిష్యత్తుకు బాసటగా నిలిచే పదో తరగతి ఉత్తీర్ణతకు, మార్కుల శాతాన్ని పెంచుకోవడానికి విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. మరో 28 రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పరీక్షలంటే ఉన్న భయాన్ని పోగొట్టి వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణనిస్తున్నారు. ఉదయం పాఠశాల సమయానికి ముందు ఒక గంట, సాయంత్రం పాఠశాల ముగింపు తరువాత మరో గంట సబ్జెక్టుల వారీగా సంబంధిత అధ్యాపకులతో అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని 7 మండలాల్లో 74 ప్రభుత్వ పాఠశాలల్లో 5,440 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోతున్నారు. దాదాపుగా ప్రతి పాఠశాలలోను ఫిబ్రవరి మొదటి వారానికే విద్యా సంవత్సరానికి సంబంధించిన సిలబస్ పూర్తి చేశారు. ఈ ఏడాదిలో పాఠశాలలో జరిగిన పరీక్షల ఆధారంగా విద్యార్థుల్లో సామర్థ్యాన్ని గణించి గ్రేడ్‌ల వారీగా విభజించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించడమే కాకుండా మంచి మార్కులు సాధించేలా చూసేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. దీనికోసమే ముందస్తుగా జనవరి నుంచి పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు జరుపుతున్నారు. పాఠశాల ప్రారంభానికి ముందు ఒక గంట, తరువాత ఒక గంట సమయం కేటాయించి విద్యార్థులకు అర్థం కాని పాఠ్యాంశాలపై మరోసారి వివరించి చెబుతున్నారు. అంతేకాకుండా పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేందుకు రోజూ ప్రాక్టీస్ కోసం రాత పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాల్ని విశ్లేషించి ఏఏ విద్యార్థులు వెనకబడి ఉన్నారో గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇటీవల జిల్లా పరిషత్ సౌజన్యంతో అందించిన జగనన్న విద్యాభారతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులు ఉదయం నుంచి పాఠశాలలో ఉండటంతో మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల్లో ఉత్సాహం పెంచడానికి దాతల సహకారంతో సాయంత్రం వేళల్లో అల్పాహారాన్ని ఏర్పాటు చేస్తుండటం విశేషంగా కనిపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ప్రత్యేక తరగతులను జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో కార్పొరేట్‌ని తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలుండాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.


భీమనపల్లి పాఠశాలలో అదనపు తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న డీవైఈవో షాలేమ్‌రాజు, ఎంఈవో కిరణ్‌బాబు

ట్రిపుల్ ఐటీ సాధించాలన్నది లక్ష్యం


పదో తరగతి పరీక్షల కోసం నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులు మాకెంతో ఉపయోగం. ట్రిపుల్ ఐటీ సీటు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అదనపు తరగతులతో నాకున్న సందేహాలు నివృత్తి చేసుకోవడం సులభమైంది. రోజువారీ ప్రాక్టీస్ పరీక్షలతో 590 మార్కుల వరకు సాధించగలననే నమ్మకం ఏర్పడింది.
– చాగంటి పావని బిందు, పదో తరగతి విద్యార్థిని, గొల్లవిల్లి జెడ్పీ హైస్కూల్, ఉప్పలగుప్తం మండలం

పరీక్షలంటే భయం పోయింది


నాకు పదో తరగతి పరీక్షలంటే ఉన్న భయం ప్రత్యేక తరగతులు, ప్రాక్టీస్ పరీక్షల కారణంగా పోయింది. పరీక్షల్లో వస్తున్న మార్కులు చూసుకుని రోజురోజుకీ మంచి మార్కులు తెచ్చుకోగలనని నాకు నమ్మకం పెరుగుతోంది. ఎవరికైనా సందేహాలుంటే మాకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు ప్రత్యేకంగా బోధిస్తున్నారు.
– ఎంపీవీఎస్ మణికుమార్, పదో తరగతి విద్యార్థి, చెయ్యేరు జెడ్పీ హైస్కూల్, కాట్రేనికోన మండలం

100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


2022 సంవత్సరంలో పరీక్షలు లేకుండా తరువాత క్లాసులకు పంపించేస్తారేమోనన్న భావనతో విద్యార్థులు నిర్లక్ష్యం వహించడంతో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఏడాది ముందస్తు ప్రణాళికతో ప్రత్యేక చర్యలు తీసుకుని 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. ఈ విషయంపై ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నాం.
– కె.కిరణ్‌బాబు, అల్లవరం–ఉప్పలగుప్తం మండలాల విద్యాశాఖాధికారి

కమ్ముకున్న పొగలతో ఉక్కిరి బిక్కిరి

- డంపింగ్ యార్డ్‌లో చెత్తకు మళ్లీ నిప్పు
- పొగలతో అవస్థలు పడిన మున్సిపాలిటీ ప్రజలు
- ఫైరింజన్‌తో ఆర్పేందుకు ప్రయత్నాలు


అమలాపురం డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు


డంపింగ్ యార్డులో మంటలు, పొగలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డులో ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్త గుట్టలకు శనివారం రాత్రి నిప్పంటుకుని పట్టణంలో దాదాపు కిలోమీటర్ మేర దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో సమీపంలోని 27, 28, 29 వార్డుల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కమ్ముకున్న పొగల కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరయ్యారు. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు దారి కనిపించక ముప్పుతిప్పలు పడ్డారు. పొగ ప్రభావం బైపాస్ రోడ్డు సావరం, నల్ల వంతెన నుంచి ముమ్మిడివరం గేటు, గడియారం స్తంభం సెంటర్ల వరకూ కనిపించింది. స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫోన్లు చేసి తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు.

స్పందించిన మున్సిపల్ అధికారులు

ఎండలు ముదురుతున్న సమయంలో డంపింగ్ యార్డ్‌లోని చెత్త గుట్టల్లో ఏదో చోట నిప్పు పుట్టడం, పొగలు రావడం సాధారణం. అయితే శనివారం రాత్రి చెత్త గుట్టల్లో అయిదు చోట్ల మంటలు పుట్టి దట్టమైన పొగలు రావడంతో దాదాపు 20 వేల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. రెండు రోజుల క్రితమే డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పంటుకున్నప్పుడు ఫైరింజన్ సాయంతో అదుపు చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. అయితే శనివారం రాత్రి మంటలు ఎక్కువగా వ్యాపించడం, ప్రజల నుంచి ఎదురైన ఫిర్యాదులతో అధికారులు మరోసారి స్పందించారు. ఆదివారం ఉదయమే ఫైరింజన్, అగ్ని మాపక సిబ్బందిని రంగంలోకి దింపి మంటలు, పొగలను అదుపు చేశారు. ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగినా మళ్లీ మళ్లీ పొగలు వ్యాపిస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నాం

ఇది మున్సిపాలిటీ సిబ్బంది తప్పిదం కాదు. చెత్త నిల్వల పొరల్లో మిథైన్ అనే గ్యాస్ ఉత్పన్నమై ఉష్ణోగ్రత పీడనం పెరిగిపోయి దానికదే ఫైర్ అవుతుంది. వేసవి కాలంలో ఈ సమస్య మరీ జటిలమవుతుంది. సమస్యకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నాం.
– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం మున్సిపాలిటీ

నేడు యానాం మీసాల వెంకన్న రథయాత్ర


విద్యుత్ వెలుగుల్లో మీసాల వెంకన్న రథం


యానాంలో కొలువైన మీసాల వెంకన్న

భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాల వెంకన్న)వారి కల్యాణోత్సవాలలో భాగంగా చారిత్రక రథోత్సం సోమవారం నిర్వహించడానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే స్వామివారి రథాన్ని స్థానిక చిన్నాసెంటర్‌కు తరలించారు. అక్కడ నుంచి సోమవారం మధ్యాహ్నం 4.45 నిమిషాలకు కశిరెడ్డి సత్యవీరవెంకన్న, కశిరెడ్డి వెంకటకృష్ణయ్య, యర్రా లక్ష్మణరావు, యర్రా సుబ్రహ్మణ్యేశ్వరరావు సోదరులచే వంశపారంపర్యంగా రథయాత్ర ప్రారంభమవుతుంది. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ముఖ్య అతిథిగా రథయాత్రలో పాల్గొననున్నారు. వెంకన్న రథయాత్ర, తీర్థానికి యానాం పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడం ఆనవాయితీగా వస్తోంది.

ఇదీ చరిత్ర

11వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి వినూత్నశోభగా మీసాలు ఉండటంతో మీసాలవెంకన్నగా భక్తజనం పిలుచుకుంటారు. అదేవిధంగా స్థానిక మత్స్యకారులు ఉదయాన్నే వేటకు వెళ్లే ముందు వేంకటేశ్వరస్వామికి చద్దికూడును ప్రసాదంగా సమర్పించేవారని, అందుకనే ఆలయాన్ని చద్దికూడువెంకన్న ఆలయంగా స్థానికులు పిలుచుకునేవారని ప్రతీతి. 1934 సంవత్సరంలో ఫ్రెంచి పాలిత యానాంలో బాల్యవివాహాలపై పట్టింపు లేదు. సరిహద్దున 1929 శారదా చట్టం ప్రకారం 14 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహాలు చేయడాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. దీంతో నిషేధమున్న బ్రిటిష్ ఇండియా ప్రాంతాల నుంచి అనేకమంది తల్లిదండ్రులు రహస్యంగా యానాం వచ్చి తమ పిల్లలకు స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో బాల్య వివాహాలు జరిపేవారు. దీంతో యానాంను కల్యాణపురంగా బ్రిటిష్ పౌరులు పిలుచుకునేవారు. అప్పట్లో తాళిబొట్లను పెద్దపెద్ద తాటాకు బుట్టల్లో వేసి అమ్మేవారంటే బాల్య వివాహాల సంఖ్య ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవొచ్చు.

అభివృద్ధి నిధులు వెనక్కి మళ్లడమేంటి?

ఆగ్రహం వ్యక్తం చేసిన పుదుచ్చేరి ఎస్ఈ భాస్కరన్


సమావేశంలో చర్చిస్తున్న పుదుచ్చేరి ఎస్ఈ భాస్కరన్, ఎమ్మెల్యే అశోక్, ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గత బడ్జెట్‌లో కేటాయించిన కోట్లాది రూపాయల నిధులు పనులు నిర్వహించక వెనక్కి మళ్లడంపై పుదుచ్చేరి పీడబ్ల్యూడీ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాస్కరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో సాగు, తాగునీటి ఎద్దడికి తీసుకోవాల్సిన అత్యవసర చర్యలు, పీడబ్ల్యూడీ నిర్మాణాలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్, ఆర్ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ భాస్కరన్ మాట్లాడుతూ అభివృద్ధి నిధులు వెనక్కి మళ్లడమేంటని ఇంజినీర్‌లు భాస్కర్, నాగరాజు తదితరులపై మండిపడ్డారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికంగా కొందరు నేతలు అభివృద్ధి నిరోధకులుగా మారి ప్రతి పనిని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వ్యాఖ్యానించారు. దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు ఎండిపోయి రైతులు ధర్నాకు దిగడంపై సమావేశంలో చర్చించారు. తక్షణం సాగునీటి ఎద్దడి నివారణతో పాటు ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

అల్లవరం: కొమరగిరిపట్నంలో ఉన్న ఆర్ష విజ్ఞాన భారతి హైస్కూల్లో 39వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం, కోలాటం అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానాచార్యుడు నాగేశ్వరరావు, కంటి వైద్యులు అయ్యగారు వెంకటేశ్వరరావు, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత అధికారి మట్టపర్తి రెడ్డి, కేఈ రమణకుమార్, కరస్పాండెంట్ అల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సదస్సులో పీఎంపీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తాళ్లరేవు: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాళ్లరేవు సూర్య మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు సురేష్‌బాబు సూచించారు. ఆదివారం స్థానిక ఆసుపత్రి ప్రాంగణంలో మచ్చా గంగాధర్‌రావు అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు సురేష్‌బాబు, ధర్మధర్, శ్రావణి తదితరులు మాట్లాడుతూ వేసవిలో టైఫాయిడ్, డయేరియా, పచ్చకామెర్లతో పాటు వైరల్ జ్వరాలు అధికంగా విజృంభించే అవకాశమున్న నేపథ్యంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లకు సూచించారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పాడి శివ ప్రసాద్, సెక్రటరీ ఎస్‌కే రహమాన్ షరీఫ్, సభ్యులు కేఎస్ బాబు, సీహెచ్ ఏడుకొండలు, జేవీవీ సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భూమిని పరిరక్షించాలి

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో సర్వే నెం 922/83లో ఆక్రమణకు గురైన 15 సెంట్ల పీర్ల పంజా భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ఖాదర్ బాషా రెవెన్యూ ఉన్నతాధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు.

స్పందించి.. వైద్యం అందించి..


క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుత్రికి తీసుకు వెళుతున్న సూర్య ఆసుపత్రి అధినేత ఎంజీఆర్, సిబ్బంది


త్రిమూర్తులుకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆస్పత్రి వైద్యులు సురేష్, ధర్మేంద్ర

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి సకాలంలో వైద్య సేవలందించి తాళ్లరేవు సూర్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నిండు ప్రాణాన్ని కాపాడారు. జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రోడ్డులో టీ టైం దుకాణం వద్ద ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయి కాకినాడ రమణయ్యపేటకు చెందిన గుంటముక్కల త్రిమూర్తులు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు స్థానికులు ప్రయత్నించగా సకాలంలో అంబులెన్స్ రాలేదు. ఈ విషయం తెలుసుకున్న సమీపంలోని సూర్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత మచ్చా గంగాధరరావు (ఎంజీఆర్) హుటాహుటిన సంఘటన స్థలానికి సిబ్బందితో పాటు చేరుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న త్రిమూర్తులును స్ట్రెచర్‌పై సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడని, ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందని ఆస్పత్రి వైద్యులు ఎం.సురేష్, ధర్మేంద్ర తెలిపారు. క్షతగాత్రుడికి వెంటనే సేవలు అందించిన ఆస్పత్రి నిర్వాహకులను స్థానికులు అభినందించారు.

క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి విశ్వరూప్


మంత్రి విశ్వరూప్‌కు స్వాగతం పలుకుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదివారం ఉదయం సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో మంత్రి విశ్వరూప్‌కు ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పొన్న వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆదివారం రాత్రి పొన్న వాహనోత్సవం వైభవంగా జరిగింది. కాపగంటి సూర్యప్రకాశరావు, ఆయన కుమారులు ఉత్సవదారులుగా నిర్వహించిన పొన్నవాహనానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

పశువులకు టీకాలు వేయించాలి

అమలాపురం రూరల్: ప్రతి పాడి రైతు పశువులకు టీకాలు వేయించాలని పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి అన్నారు. జి.అగ్రహారం గ్రామంలో పశువైద్యాధికారిణి సాహిత్య ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ వైద్య శిబిరాన్ని విజయారెడ్డి ప్రారంభించారు. గొర్రెలకు రక్త నమూనాలను కాకినాడ పశువైద్యులు ఏసుకుమారి సేకరించారు. శిబిరంలో పశు వైద్య ఉద్యోగులు పి.రాజు, నరేష్, కరుణ, పైడికొండల మంగయమ్మ, మేడిచర్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్, ఎవీఎస్ హాస్పటల్ సౌజన్యంతో స్థానిక లయన్స్ క్లబ్‌లో లెగ్ అల్సర్స్, వెరికోస్ వ్యాధులపై ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరంలో 70 మంది రోగులను పరీక్షించారు. శిబిరంలో లయన్స్ అధ్యక్షుడు జంపన సుమన్ వర్మ, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ అనిల్‌కుమార్ జైన్, కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, కోశాధికారి పంపన సూర్యతేజ, జోనల్ చైర్ పర్సన్ బూరగాయల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఐ పటిష్టతకు చర్యలు

తాళ్లరేవు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నట్లు బీఎస్ఐ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కాశి జానకిరాముడు తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తాళ్లరేవు మండల శాఖ ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సంఘ నూతన కార్యవర్గ అధ్యక్షునిగా పినిపే నాగేంద్రరావు, జనరల్ సెక్రటరీగా దడాల రామకృష్ణ, కోశాధికారిగా కోరుకొండ నాగేశ్వరరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోండి

అల్లవరం: ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ నిర్మాణంతో డ్రెయిన్లు మూసుకుపోయి కొబ్బరి, సరుగుడు తోటలు ముంపునకు గురవుతున్నాయని, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కి ఓడలరేవు గ్రామస్తులు ఆదివారం వినతి పత్రం అందించారు. టెర్మినల్ విస్తరణ, ప్రహరీ నిర్మాణంతో మురుగునీరు దిగే బోదె మూసుకుపోయిందన్నారు. దీంతో టెర్మినల్‌కు ముందుండే పొలాలన్నీ ముంపు బారిన పడుతున్నాయని, దీనిపై గతంలో ఓఎన్‌జీసీ అధికారుల దృష్టికి తీసుకెళితే డ్రెయిన్ నిర్మిస్తామని వాగ్దానం చేశారే తప్ప పనులు చేయలేదని వివరించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి విశ్వరూప్ బదులిచ్చారు. మంత్రిని కలిసివారిలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, చొల్లంగి రాధాకృష్ణ, మల్లాడి ఉమమహేశ్వరరావు, కె శ్రీను, సత్యనారాయణ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముమ్మిడివరం: ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టిన ఘటనలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అంబాజీపేట మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన దొంగ హరిప్రసాద్, కొప్పిశెట్టి శ్రీనివాస్ మోటార్‌సైకిల్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా ముమ్మిడివరం మండలం కొమానపల్లి జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరిని కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంపీ, ఆర్ఎంపీల నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కాట్రేనికోన: కాట్రేనికోన మండల పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. మండల పీఎంపీ, ఆర్ఎంపీ వైద్యుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొమ్మిడి ధర్మారావు, ఉపాధ్యక్షుడిగా గోసంగి సత్యనారాయణ, కార్యదర్శిగా మట్టా ఏడుకొండలు, ఉప కార్యదర్శిగా మీరా మహ్మద్, ట్రెజరర్‌గా ఆర్.సురేష్‌బాబు, పి.శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.ధర్మారావు, వాసంశెట్టి శ్రీనివాస్, పాలెపు ఏడుకొండలు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టైపిస్టుల సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

అమలాపురం రూరల్: జిల్లా రెవెన్యూ అవుట్ సోర్సింగ్ టైపిస్టుల నూతన సంఘం అధ్యక్షుడిగా అమలాపురం ఆర్డీఓ కార్యాలయం టైపిస్ట్ బి.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న రెవెన్యూ అసోసియేషన్ బిల్డింగ్‌లో కోనసీమ జిల్లా రెవెన్యూ అవుట్ సోర్సింగ్ టైపిస్టుల నూతన కార్యవర్గం ఎన్నికలు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. సహ అధ్యక్షుడిగా ఐ.సత్యదేవ్, ప్రధాన కార్యదర్శిగా భాస్కరరావు, కోశాధికారిగా ధర్మరాజు, ఉపాధ్యక్షులుగా టి.దుర్గా ప్రసాద్, కె.రోజారమణి, సంయుక్త కార్యదర్శిగా జి.రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులను రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ అభినందించారు.

రూ.11,600 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

యానాం: పుదుచ్చేరి 2023–24 పూర్తిస్థాయి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11,600 కోట్ల బడ్జెట్‌కు ఆదివారం కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపింది. ప్లానింగ్ కమిషన్ రూపొందించిన కేంద్రపాలిత ప్రాంత పుదుచ్చేరి బడ్జెట్ ప్రతిపాదనలకు ముందుగా కేంద్ర హోంశాఖ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు వెళ్లడం, దాన్ని వారు ఆమోదం తెలిపాకే అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. మొదటి రోజున ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ప్రసంగించనున్నారు. రెండు రోజుల పాటు గవర్నర్ ప్రసంగంపై చర్చ అనంతరం 13న ఆర్థిక శాఖ సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.